క్లుప్తంగా

మహా పాదయాత్ర కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పొదిలి: శ్రీరంగం నుంచి అయోధ్య వరకు అక్టోబర్ 12 వ తేదీ నుంచి మహాపాదయాత్ర నిర్వహించనున్నట్లు గోవిందనామ ప్రచార సేవా సంఘం సభ్యులు మేడా నరసింహారావు తెలిపారు. ఈ మేరకు స్థానిక శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు, ఆలయ అర్చకులు మురళీకృష్ణమాచార్యుల చేతుల మీదుగా కరపత్రాలు ఆవిష్కరించారు. నరసింహారావు మాట్లాడుతూ.. కరపత్రాల్లో ఒక వైపు ఉన్న ఖాళీ గడులను గోవింద నామాలతో నింపాలని భక్తులకు సూచించారు. చిరునామా, ఫోన్ నంబర్ రాసి ఆలయ కమిటీ సభ్యులకు అందజేయాలని కోరారు. లోకకళ్యాణార్థం, రైతు సంక్షేమం కోసం 120 రోజులపాటు 2500 కి.మీ మేర నిర్వహించే ఈ మహాపాదయాత్రలో పాల్గొనే భక్తులు తమ వివరాలను సభ్యులకు తెలియజేయాలని చెప్పారు.

విత్తనాల దుకాణాలు తనిఖీ



కంభంలో విత్తనాల దుకాణాలు తనిఖీ చేస్తున్న ఏఓ

కంభం: దుకాణదారులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి డి.స్వరూప హెచ్చరించారు. పట్టణంలోని పలు విత్తనాల దుకాణాలను మంగళవారం సాయంత్రం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాలకు సంబంధించిన ఫారం సి, నిల్వల రిజిస్టరు తనిఖీ చేసి నిల్వ ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. విత్తనాలు విక్రయాలు చేసే సమయంలో రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు ఉన్న విత్తనాలు మాత్రమే విక్రయించాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూసార పరీక్షల ఆధారంగా సాగు చేయాలి

గిద్దలూరు రూరల్: రైతులు భూసార పరీక్షల ఆధారంగా పంటలను సాగు చేయాలని వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. కంది పంటలో జీఏపీ పొలంబడి శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని సంజీవరాయుడుపేటలో రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో నికర ఆదాయం వచ్చే పంటలను సాగు చేయాలని, ప్రతి రైతు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. మట్టి పరీక్షల ఆధారంగా వ్యవసాయం చేస్తే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఎరువుల వాడకం, విత్తన శుద్ధి, చీడపీడల నివారణ, అంతర్గత పంటల ద్వారా మిత్రపురుగులను వృద్ధి చేయడం వంటి అంశాలను గురించి రైతులకు వివరించారు. వ్యవసాయశాఖ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఇంటింటికీ పింఛన్ల పంపిణీ

కొమరోలు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆగస్టు 1వ తేదీ నుంచి ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బందితో ప్రతి ఇంటికి పంపిణీ చేస్తామని, ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులందరూ ఇంటి వద్దే ఉండి పింఛన్ అందుకోవాలని తెలిపారు. మొదటి రోజే 99 శాతం లబ్ధిదారులకు పంపిణీ జరిగే విధంగా సచివాలయ సిబ్బందికి పింఛన్‌దారులు సహకరించాలని కోరారు.

రూ.2.91 లక్షల విత్తనాల అమ్మకాలు నిలుపుదల

పొదిలి: పట్టణంలోని పలు ఎరువులు, పురుగుమందులు, విత్తనాల దుకాణాలను యర్రగొండపాలెం వ్యవసాయ సహాయ సంచాలకులు నీరజ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో అమ్మకాలకు అనుమతులు లేని రూ.2.91 లక్షల విలువైన విత్తనాలను గుర్తించారు. ఆ విత్తనాల విక్రయాలకు అనుమతి పత్రాలు వచ్చేంత వరకు అమ్మకాలు నిలుపుదల చేసినట్లు చెప్పారు. భవానీ ఫర్టిలైజర్స్, శ్రీలక్ష్మీ ట్రేడర్స్, సాయి కృష్ణా ట్రేడర్స్, శ్రీకృష్ణా ఫెర్టిలైజర్స్, జై కిసాన్ ఫామ్ హబ్, శ్రీబాలాజీ ట్రేడర్స్, మన గ్రోమోర్ సెంటర్‌లను తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. నిల్వలకు, రికార్డులకు పరిపోల్చి పరిశీలించారు. వ్యవసాయాధికారి షేక్.జైనులాబ్దిన్ మాట్లాడుతూ రైతులకు తప్పనిసరిగా దుకాణదారులు అమ్మకాలకు సంబంధించిన వివరాలతో బిల్లులు తప్పని సరిగా ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



రికార్డులు పరిశీలిస్తున్న నీరజ



పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల మధ్య వేసిన చెత్త, చెదారం



మంచినీటి కుళాయి చుట్టూ మురుగునీరు

అపరిశుభ్రంగా కందులాపురం పాఠశాల

- గ్రామంలో డెంగీ కేసు నమోదు
- చెత్తను తొలగించి పరిసరాలు శుభ్రం చేయాలంటున్న తల్లిదండ్రులు
- జ్వరాలు ప్రబలకముందే అధికారులు చర్యలు చేపట్టాలంటున్న స్థానికులు



పాఠశాల ఎదుట కాలువలో నిలిచిన మురుగు

కంభం: మండలంలోని కందులాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో చెట్లకొమ్మలు, చెత్తా, చెదారం, వ్యర్థాలతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఇటీవల కాలంలో పాఠశాల ఆవరణలో ఉన్న మోనోకార్పస్ చెట్లను తొలగించగా వాటి కొమ్మలను పాఠశాల ఆవరణలో ఓ వైపు పడేశారు. ఇదే ఆవరణలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. పాఠశాల భవనాలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు మధ్య చెట్ల కొమ్మలు పడేయటం, చెత్తా చెదారం కూడా అందులోనే వేస్తుండటంతో పరిసరాలు డంపింగ్ యార్డుగా మారిపోయాయి. పాఠశాలలో 120 మంది విద్యార్థులు ఉండగా అంగన్‌వాడీ కేంద్రాలకు నిత్యం 30 మంది చిన్నారులు వస్తుంటారు. చుట్టుపక్కల పరిసరాలు సైతం చిల్లచెట్లు, గడ్డితో నిండి ఉండటంతో పరిసరాల్లో పాములు, ఇతర విష కీటకాలు సంచరిస్తున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖాధికారులు స్పందించి మైదానంలో ఉన్న చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామంలో డెంగీ కేసు నమోదు

గ్రామానికి చెందిన మహానందరెడ్డి అనే వృద్ధుడికి డెంగీ సోకడంతో గుంటూరులో చికిత్స అందిస్తున్నారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, రెండు నెలలకొకసారి కూడా కాలువలు శుభ్రం చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. పాఠశాల ఎదురుగా ప్రహరీకి ఆనుకొని ఉన్న డ్రైనేజీ కాలువలో మురుగునీరు నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. డెంగీ వ్యాధి మరింత ప్రబలక ముందే గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు మెడికల్ క్యాంప్ నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మురికి కాల్వలు శుభ్రం చేసి రెండు నెలలు:



గ్రామంలో రెండు మూడు నెలలకొకసారి కూడా మురికి కాలువలు శుభ్రం చేయడం లేదు. దోమల బెడద పెరిగిపోతోంది. ప్రజలు రోగాల బారిన పడక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలి.
– సీహెచ్ జనార్దన్‌రెడ్డి, కందులాపురం

మురుగు నిలిచిపోతోంది:



మురుగు కాలువలు శుభ్రం చేయక పోవడంతో ఇళ్ల ముందే కాలువల్లో మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. డ్రైనేజీ కాలువలు పది రోజులకొకసారైన శుభ్రం చేసి బ్లీచింగ్ వేయాలి. అధికారులకు చెప్పినా చర్యల తీసుకోవడం లేదు.
– ఖాసిం, కందులాపురం

పాములు తిరుగుతున్నాయి:



పాఠశాల పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. చెత్తా చెదారం, గడ్డి పెరగడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఓ పాము కూడా కనిపించినట్లు విద్యార్థులు చెబుతున్నారు.
– పిల్లి శ్రీనివాసులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్, కందులాపురం

డెంగీ ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ



వేములకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కంభం: గ్రామాల్లో డెంగీ ప్రబలకుండా పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయపు సమావేశపు హాలులో ఆమె అధ్యక్షతన సీజనల్ వ్యాధులపై పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, వైరల్ ఫీవర్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తురిమెళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అక్తర్ రసూల్ మాట్లాడుతూ జ్వరాలపై అశ్రద్ధ వహించరాదన్నారు. జ్వరం వస్తే పారాసిట్మాల్ వేసుకోవాలని, రెండు రోజుల్లో జ్వరం తగ్గకపోతే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని, డెంగీ దోమలు పగటి పూట కుడతాయన్నారు. జ్వరం బారిన పడిన వారు విశ్రాంతి తీసుకుంటూ రాగి జావా, పండ్ల రసాలు తీసుకోవాలన్నారు. నీటి తొట్లు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యాధులు రాకముందే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్‌వలి, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తే డెంగీ దూరం

మార్కాపురం: డెంగీ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా వేములకోట గ్రామంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆర్.నాగేంద్రరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డెంగీ లక్షణాలు, వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.అరుణకుమారి మాట్లాడుతూ.. మురికి నీరు ఇంటి పరిసరాల్లో నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం స్వర్ణలత, ఎంఎల్‌హెచ్‌పీ ప్రత్యూష, వెల్ఫేర్ అసిస్టెంట్ రమణారెడ్డి, మహిళా పోలీసు నవిత, సౌజన్య, అంగన్‌వాడీ టీచర్లు జయలక్ష్మి, రాములు, సరిత, సరళ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తోళ్లమడుగు వద్ద ఆక్రమణలు తొలగించాలి



అర్జీ అందజేస్తున్న రవిచంద్ర

పొదిలి: దర్శి రోడ్డులోని తోళ్లమడుగు వద్ద అక్రమణలు తొలగించాలని ఆర్‌అండ్‌బీ డీఈ జి.కృష్ణకు దాసరి రవిచంద్రకుమార్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. నగర పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 479లో ప్రభుత్వ రోడ్డును ఒక వ్యక్తి ఆక్రమించుకుని రేకుల షెడ్ నిర్మించుకున్నాడని, దీంతో సర్వే నంబర్ 396–7లో 0.96 ఎకరాల తన మాగాణి భూమిలోకి వర్షం నీరు చేరి కోతకు గురువుతోందని అర్జీలో పేర్కొన్నారు. రోడ్డు ఆక్రమణపై ప్రశ్నిస్తే అది తన సొంత భూమి అని ఆక్రమణదారుడు దౌర్జన్యం చేస్తున్నాడని వివరించారు. అధికారులు స్పందించి తన భూమి కోతకు కారణమవుతున్న ఆక్రమణలు తొలగించాలని కోరారు.

ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు



ఆలయం వద్ద బహిరంగ మలవిసర్జనకు వెళ్తున్న స్థానికుడు



చర్యలు తీసుకున్నామని ఉన్నతాధికారులకు తెలియజేసిన నివేదిక



విచ్చలవిడిగా తిరుగుతున్న పందులు

గిద్దలూరు రూరల్: తప్పుడు నివేదికలు ఉన్నతాధికారులకు పంపడంలో గిద్దలూరు నగర పంచాయతీ అధికారులు సిద్ధహస్తులు. నగరంలో పందులు విచ్చల విడిగా తిరుగుతున్నాయంటూ ఈ నెల 17వ తేదీన ‘మేం పక్కా లోకల్’ శీర్షికతో ‘సాక్షి’లో ఓ కథనం ప్రచురితమైంది. దీనికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నగర పంచాయతీ అధికారులను నివేదిక కోరారు. గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలో పందులను 5 కిలో మీటర్ల దూరంలో వదిలే ఏర్పాటు చేశామని, అదే విధంగా కొండపై శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయం ఆవరణలో బహిరంగ మలవిసర్జన నివారణకు చర్యలు తీసుకున్నామని తప్పుడు నివేదికను తయారు చేసి పంపారు. అందుకు పూర్తి విరుద్ధంగా పట్టణంలోని కొండ మీద శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయం ఆవరణలో బహిరంగ మలవిసర్జన రోజూ జరుగుతోంది. ఆ ప్రాంతంలో ఏ ఒక్కరిపై జరిమానాలు విధించిన దాఖలాలు లేవు. పలు వీధుల్లో విచ్చలవిడిగా పందులు తిరుగుతున్నా వాటి పోషకులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ విధంగా శుభ్రత పరిశుభ్రతపై దినపత్రికల్లో వచ్చిన కథనాలకు నగర పంచాయతీ అధికారులు స్పందించకుండా.. స్పందించినట్లు ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నగర పంచాయతీ పరిధిలోని నల్లబండ బజారు, రాజానగర్, రాచర్ల రోడ్డు, పలు వీధుల్లో సంచరిస్తున్న పందులను నివారించి కొండ మీద శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయం ఆవరణ రోడ్డులో బహిరంగ మల విసర్జనను నివారించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీ భవనం పూర్తయ్యేనా?



దాసర్లపల్లిలో శ్లాబ్ దశలో ఆగిన నూతన భవనం



అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్న శిథిల భవనంపై పెరిగిన చెట్లు

పొదిలి రూరల్: పొదిలి మండలం దాసర్లపల్లి గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. ఈ భవన నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేశారు. అయితే నిధుల విడుదలలో జాప్యం కారణంగా శ్లాబు దశలోనే భవన నిర్మాణం నిలిచింది. సుమారు 15 మంది చిన్నారులు ఉన్న ఈ అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరిన భవనంలో కొనసాగుతోంది. ఆ భవనం శ్లాబు పెచ్చులూడి పడుతూ, వర్షం కురిస్తే నీరు కారుతోంది. భవనంపై చెట్లు కూడా పెరగడంతో ఎప్పుడు కూలుతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉత్పత్తిదారుల సంఘంతో రైతులకు మేలు



పంటల సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు రమణ, గోపిచంద్

అర్ధవీడు (బేస్తవారిపేట): ఉత్పత్తిదారుల సంఘంతో దళారీ వ్యవస్థ లేకుండానే పండించిన పంటలను అమ్ముకోవచ్చని జిల్లా ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పీవీ రమణ అన్నారు. మండలంలో సబ్సిడీపై నూతనంగా నిర్మించుకున్న నాగులవరంలోని పంట సేకరణ కేంద్రం, అర్ధవీడులోని ప్యాక్ హౌస్‌లను మంగళవారం పరిశీలించారు. రైతులు గ్రూప్‌లుగా ఏర్పడి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు పండించిన పంటలను కలెక్షన్ సెంటర్‌లోకి తెచ్చుకుని గ్రేడింగ్ చేసుకోవడంతో ఎండ, వానల నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు. జిల్లా ఉద్యానవనశాఖ అధికారి గోపిచంద్ మాట్లాడుతూ బత్తాయి మొక్కల కాండానికి బంక తెగులు సోకకుండా బోడోపేస్ట్ పూసుకోవాలన్నారు. ఎరువుల యాజమాన్యం, పచ్చిరొట్ట పైర్లు, మట్టి పరీక్ష విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారిణి డీ శ్వేత, ఉద్యానవన విస్తరణాధికారి వై చిన్న శేషగిరి, ఉద్యానవన సహాయకులు మహేష్, పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫలహారాలతో భోజనం



విద్యార్థులకు ఫలహారాలు వడ్డిస్తున్న ఉపాధ్యాయులు

కంభం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం శుభతిథిని పురస్కరించుకొని దాతలు విద్యార్థులకు ఫలహారాలు అందించి విద్యార్థులతో సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పుట్టిన రోజు, పెళ్లిరోజు, నామకరణం, షష్ఠి పూర్తి వంటి శుభదినాలను పురస్కరించుకొని ఇతరులకు సహాయ సహకారాలు అందించడం, దానధర్మాలు చేస్తే ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారన్నారు. దాతలు సలీం బాషా, సత్యరామారావు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

గిద్దలూరు రూరల్: మానవ అక్రమ రవాణాను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని న్యాయవాది పిచ్చయ్య యాదవ్ అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సాయి చైతన్య డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ స్పెషల్ డ్రైవ్‌ను వినియోగించుకోవాలి

కొమరోలు: పోస్టాఫీసులో నిర్వహించే ఇన్సూరెన్స్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోస్టుమాస్టర్ కృష్ణారెడ్డి సూచించారు. మండల కేంద్రం కొమరోలులోని పోస్టాఫీసులో ప్రజలకు స్పెషల్ డ్రైవ్‌పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలునిపల్లె పోస్టాఫీసు పోస్టుమాస్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ 555 రూపాయల నగదు చెల్లిస్తే ఒక్కొక్కరికి 10 లక్షల రూపాయల బీమా పొందవచ్చని, 755 రూపాయలకు 15 లక్షల రూపాయల బీమా పొందవచ్చని తెలిపారు. ఇన్సూరెన్స్ చేయించుకునేవారు ఆధార్ కార్డు, మొబైల్ నంబర్‌తో పోస్టాఫీసులో సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

రవాణా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గిద్దలూరు రూరల్: రవాణ కార్మికుల సమస్యలు ప్రభుత్వ పరిష్కరించాలని సీఐటీయూ నాయుడు టి.అవులయ్య అన్నారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల బస్సుల డ్రైవర్లు, క్లీనర్ల సంఘం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణ రంగ కార్మికుల మీద అనుసరిస్తున్న విధానాలు కార్మికులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని చెప్పారు. విద్య, వైద్యం ఖర్చులు భారంగా మారాయన్నారు. కార్మికులు చాలీచాలని వేతనాలతో సతమతవతూ ఆర్థిక ఇబ్బదులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సందర్భంగా స్కూల్ బస్సు డ్రైవర్ వర్కర్సు యూనియన్ ఏర్పాటు చేసుకుని రిజిస్టర్ చేసుకున్నట్లు తెలిపారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది రామచంద్ర

మార్కాపురం టౌన్: మానవ అవయవాలు విక్రయించడం, మహిళలతో వెట్టిచాకిరీ నిమిత్తం మానవ అక్రమ రవాణా ముఠాలు సమాజంలో సంచరిస్తున్నదున అప్రమత్తంగా ఉండాలని న్యాయవాది పి.రామచంద్ర పేర్కొన్నారు. మంగళవారం మానవ అక్రమ రవాణా దినాన్ని పురస్కరించుకుని రెడ్డి మహిళా కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మహిళలు, విద్యార్థులకు మానవ అక్రమ రవాణా శక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు అనవసర విషయాల్లో పాలుపంచుకోకుండా చదువుపై ఏకాగ్రత కలిగి ఉండాలని, కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కె.రామయ్య, రెడ్డి ఉమన్స్ కళాశాల కరస్పాండెంట్ సావిత్రమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.